ఎందుకంటే ఏమి చెప్పను?

— 'యశోధర్'



చంద్రుడు కృష్ణపక్షానికి చిక్కి, బాగా చిక్కిపోయాడు. నీలం మల్లెపందిరికిపూచిన చిరు తెల్లమొగ్గల్లా వున్నాయి నక్షత్రాలు.

శనివారం కావడంతో టివిలో హిందీ సినిమా వస్తోంది. ఇంట్లో వారంతా సినిమా చూడటంలో లీనమై వున్నారు.

ఇరవయ్యేళ్ళ వనజ మనసు మాత్రం సినిమా మీద లేదు. శనివారం సాయంత్రమైతే చాలు - వనజ మనసు అలా మారిపోవడం సహజమే!

మంచం మీద దిండుకి ఆనుకుంది వనజ. మళ్ళీ అంతలోనే అన్పించింది. మధ్యాహ్నమంతా కష్టపడి మాల గుచ్చుకున్న మల్లెలన్నీ ఆ దిండుని తాకగానే నలిగిపోతాయేమోనని.

''ఆయన పూలు తీసుకొస్తారేమో! ఏం తీసుకొస్తారబ్బా, పోయిన వారమైతే విరజాజులు, అంతకుమునుపు మల్లెలు. పెళ్ళికాక మునుపు నుంచి కూడా పూలు పెట్టుకుంటూనే వుంది తను. అందంగా కన్పించడానికి ఓఒ అలంకరణ సామగ్రిగా మాత్రమే వుండేది పూలదండ!

కాని రెండు నెలల క్రితం పెళ్ళయినప్పటి నుంచి పూలు, కొత్తకొత్త పాఠాలు నేర్పుతున్నాయి. ఆ పూల చెండుని చూస్తే... మనసుని ఓ మాధుర్యమైన పరిమళం తాకుతుంది. ఎన్నెన్నో అల్లర్లు, సరదాలు, నవ్వులు... ఆ సువాసనలో చిత్రంగా ధ్వనిస్తుంటాయి.

''బావ యింకా రాలేదేమిటో?'' అన్నాడు వనజ తమ్ముడు ప్లేట్‌లో వేసిన జంతికలు తింటూ.

''ప్రతివారం అంత దూరం నుంచి రావాలంటే మాటలా! బ్యాంక్ అయ్యాక ఏ నాలుగుకో బస్సు ఎక్కుతారు. మళ్ళీ అక్కడ నుంచి టౌన్ వచ్చేటప్పటికి ఎంత లేదన్నా ఏడు - ఏడున్నర అవుతుంది.

అక్కడ నుంచి బస్సు పట్టుకుని మన వూరు రావాలి! ఒక్క రోజు యింత దూరం ప్రయాణించాలంటే బావకి మాత్రం విసుగు రాదూ? అందుకే ఈ వారం రాడేమో?!

చెల్లెలు మాట్లాడిన ఆ చివరి మాట విని వనజ మనసు గతుక్కుమంది. 'కొంపదీసి ఈ వారం ఆయన రాకుండా మానేస్తారా?' అని భయమేసింది.

శ్రావణమాసానికి యిల్లు చూస్తానన్నాడు ఆమె భర్త శ్రీకాంత్. కొత్త కాపురం పెడుతున్నప్పుడు మంచి రోజు చూసుకోవడంతో పాటు, కొత్త కాపురానికి అవసరమైన సరంజామా కూడా ఏర్పాటు చేసుకోవాలి కదా!

అలాగని వనజకి దూరంగా వుండలేడు. ప్రతి శనివారం రాత్రికి అత్తగారి వూరు చేరుకోవడం... ఆదివారమంటా ఆనందంగా గడపటం, సోమవారం తెల్లవారు ఝామున బయల్దేరి ఆఫీసుకి చేరుకోవడం... ప్రయాణం ఎంత విసుగు కలిగించనీ, వనజతో గడిపిన మధుర క్షణాల ముందు ఆ బడలికి దూదిపింజెలా తేలిపోతుందతనికి.

★ ★ ★

వనజకి దిగులుగా అన్పించింది - ఆయన రాకపోతే ఈ రాత్రి... ఈ వారంలోని అన్ని రోజుల్లాగే నిరాసక్తంగా, నిరర్థకంగా గడచిపోతుంది.

మనసులోనే కనకదుర్గమ్మకి దణ్ణం పెట్టుకుంది. - ''అమ్మా! ఆయన తప్పకుండా రావాలి'' అని.

ఇంతలో కరెంట్ పోయింది. అందరూ బయటికి వచ్చి, అరుగు మీద కూర్చున్నారు.

వీధి మలుపులోకి తొంగి చూసింది వనజ. ఎక్కడయినా భర్త వస్తున్న జాడ కనబడుతుందేమోనని.

వనజ తాపత్రయం ఆమె వదిన కంట బడింది. ''ఇంత అందాల బొమ్మని వదిలేసి మీ ఆయన రాకుండా వుండరులే'' అని చెవిలో రహస్యంగా గొణిగింది.

మాట మార్చడానికి ''అన్నయ్య ఏమిటి - ఈ వేళయినా ఇంకా రాలేదు - సెంటర్లో వుండి పోయారా?'' అనడిగింది వనజ.

''కాదు వనజా! బహుశా టౌన్‌కి వెళ్ళి వుంటారు మీ అన్నయ్య - ఏ సినిమా చూడటానికో''.

వదిన చెప్పిన జవాబు యాంత్రికంగా వింది కాని వనజ మనసంతా ఎక్కడో పరిభ్రమిసోంది.

అన్నయ్య వదినని వదిలేసి ఒక్కడూ ఎలా వెళ్ళ గలిగాడు? భార్యాభర్తలు సరదాగా కలిసి తిరగక, ఒక్కరూ ఎలా గడుపుతారు? రేపు కాపురం పెట్టాక ఈయనా అంతేనా?

తనని యింట్లో వదిలేసి అర్ధరాత్రి వరకూ బయట చక్కర్లు కొడుతుంటాడా? అని మనసులో ఓ చిన్నసందేహం ఉదయించింది వనజకి.

ఆ రోజు రాత్రి తొమ్మిది దాటినా శ్రీకాంత్ జాడలేదు. అతని గురించి ఇంట్లో వాళ్ళు ఎదురుచూసి చూసి ఎవరి దారిన వారు నిద్రపోయారు.

వనజకి మాత్రం నిద్ర రాలేదు. ఉక్రోషంతో ఏడుపు వచ్చింది. పెళ్ళయ్యి రెండు నెలలు కాకమునుపే తన మీద ప్రేమ తగ్గిపోయిందా? ఈ వారం రాలేదు - చేసుకున్న అలంకరణ అంతా వృధా అన్పించిందామెకు.

టిఫిన్ కూడా తినకుండానే వనజ నిద్రపోయింది. ఓ రాత్రి వేళ... ఆమెకు మెలకువ వచ్చి చూసేటప్పటికి వనజ పక్కనే పడుకుని ఆమెకేసి తదేకంగా చూస్తున్నాడు శ్రీకాంత్.

అది కలో - నిజమో అర్థం కాలేదు. చటుక్కున ఉలిక్కిపడి లేచి, 'మీరెప్పుడు వచ్చారు?' అనడిగింది.

శ్రీకాంత్ నవ్వుతూ, ''త్వరగా బయల్దేరి ఆరు గంటలకే టౌన్‌లో దిగాను. మీవూరి బస్సు కోసం ఎదురు చూస్తుంటే, మీ అన్నయ్య కనబడ్డాడు. నన్ను బలవంతంగా సినిమాకి లాక్కెళ్ళాడు.

అసలు మీ అన్నయ్యకి బుర్రలేదు. కొత్త పెళ్ళి కొడుకుని కదా! పాపం, నువ్వు ఎదురు చూస్తుంటావు అనే ఆలోచన అయినా రాలేదు.

టౌన్‌లో లాస్ట్ బస్ పట్టుకుని వచ్చేటప్పటికి యిదిగో, ఈ వేళ అయ్యింది. నువ్వు నిద్రలో వున్నావు. నిద్రలో నీ సోయగం చూస్తూ కునుకు వేయడం మర్చిపోయాను అన్నాడు శ్రీకాంత్ నవ్వి ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

★ ★ ★

పెరట్లో చిక్కుడు పాదు దగ్గర కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు శ్రీకాంత్, వనజ.

ఇంట్లో వాళ్ళంతా టివిలో తెలుగు సినిమా చూస్తూ కూర్చున్నారు.

''శనివారం రాత్రి ఎంతగా ఎదురు చూస్తానో, ఆదివారం అంతగా దిగులుపడతాను - మీరెళ్ళిపోతుంటే. మళ్ళీ శనివారం వరకూ ఎదురు చూడాలంటే ఎంత బాధో? ఎందుకో మిమ్మల్ని వదిలి వుండాలన్పించదు'' శ్రీకాంత్ మోకాళ్ళపై గడ్డం ఆన్చి అంది వనజ.

ఆ భంగిమలో వనజ ఎంతో అందంగా అన్పించింది. ఆమె లేత పెదవులని తన పెదవులతో పలకరించాడు శ్రీకాంత్.

''అమ్మో! ఎవరయినా వస్తారేమో'' అంది వనజ అటు - యిటూ చూస్తూ.

''టివి ముందు నుంచి ఎవరూ లేవరులే! అయినా కొత్త జంట యింట్లో వున్నప్పుడు మిగిలిన వారంతా ఎవరి గదుల్లో వాళ్ళు వుండిపోవాలి తప్ప, బయటికి రాకూడదు.

ఎందుకంటే, మనలాంటి వాళ్ళకి ఎక్కడ ఏ సమయంలో ఏ సందర్భంలో మనసు చెదిరిపోతుందో ఏకాంతాన్ని ఓ కౌగిలింతలో సద్వినియోగం చేసుకోవాలని పిస్తుందో?'' అంటూ వనజని దగ్గరకు హత్తుకున్నాడు.

ఇంకాసేపుంటే, ఆ పెరడునే పందిరి మంచంగా మార్చే ప్రమాదం వుందని గుర్తించి, భర్తను సున్నితంగా వదుల్చుకుని, ఇంట్లోకి పరుగెత్తింది వనజ. కాలి అందెలు, చేతి గాజులు సంబరంతో సవ్వడి చేసుకుంటూ ఆమె పరుగుని అనుకరించాయి.

వనజ గొంతు లోపలి నుంచి వినబడుతుంది. ''అమ్మా! ఆయనకి భోజనం త్వరగా వడ్డించండమ్మా! ఫస్ట్ బస్‌కి పొద్దున్నే లేచి వెళ్ళాలిగా! భోంచేసి త్వరగా పడుకుంటారు''

ఆ మాటలోని అంతరార్థం బోధపడి, పెరట్లో కూర్చున్న శ్రీకాంత్ పకపకా నవ్వుకున్నాడు.

★ ★ ★

తెల్లవారుఝాము కావడంతో వేసవికి - వానాకాలానికి మధ్య వున్నా ఎందుకో చలిచలిగా వున్నట్లన్పిస్తోంది.

బస్సు కిటికి అద్దాలు వేసి వెనక్కి కూర్చున్నాడు శ్రీకాంత్.

టైమ్ చూసుకున్నాడు - ఆరుంబావు కావస్తోంది, నాలుగు గంటలకి లేవబట్టి లక్కీగా టౌన్‌లో ఫస్ట్ బస్ కదిలే సమయానికి అందుకున్నాడు.

'ఇదిగో - యిప్పుడు బస్సు బయల్దేరింది. ఇంకో రెండు మూడు గంటల్లో వుద్యోగం చేస్తున్నా వూరుకి చేరుకుంటాడు. బ్యాంక్ పని... రొటీన్' శ్రీకాంత్ ఆలోచనలను భగ్నం చేస్తూ బస్ కండక్టర్ వచ్చి టికెట్ అడిగాడు.

చొక్కా జేబులోకి చేయి పోనిచ్చిన శ్రీకాంత్‌ని వెక్కిరిస్తూ ఓ అయిదు రూపాయల నోటు, రెండు రూపాయల నోటు బయటికి వచ్చాయి. కంగారుగా జేబులన్ని తడుముకున్నాడు శ్రీకాంత్.

ఎక్కడా లేవు - ఏమైంది? అంత తెల్లవారు ఝామునే ఖాళీగా వున్న బస్సులో జేబు కొట్టేసే అవకాశం లేదు. రాత్రి పర్సు పాత జతలో మర్చిపోయినట్లున్నాడు.

సామాన్యంగా - వేసుకొచ్చిన జత అత్తవారింట్లో వదిలేస్తుంటాడు. మళ్ళీ వచ్చేసరికి ఆ జతని వుతికి, ఇస్త్రీ చేయించి సిద్ధంగా వుంచుతారు.

''డామిట్! తను చూసుకోకుండా ఆ బట్టలు క్రింద పడేసినట్లున్నాడు!''

చేసేది లేక, శ్రీకాంత్ బస్సు దిగి, మళ్ళీ అత్తారింటికి చేరుకున్నాడు. బట్టలన్నీ వెతికినా ఆ పర్సు కనబడలేదు. ఎలా పోయిందో శ్రీకాంత్‌కి అర్థం కాలేదు.

★ ★ ★

ఆ రాత్రి మళ్ళీ ఓ మాధుర్య పారవశ్యాన్ని వనజతో కలిసి పంచుకుంటున్నప్పుడు వనజ ఆకస్మాత్తుగా అంది - ''మీకో చిన్న కానుక''

''ఏమిటి?'' అన్నాడు శ్రీకాంత్ విభ్రమంగా చూస్తూ.

దిండు క్రింద వున్న పర్సు తీసి అతనికి అందించింది వనజ.

''ఎక్కడ దొరికింది?''

''దొరకలేదు - దొంగిలించాను''

''నీకా అవసరమెందుకు?''

వనజలో ఓ సిగ్గు కనీ కన్పించనట్లు - ఓ నదిలో అలని ఓ సూర్యకిరణం చప్పున మెరిపించి, మురిపించినట్లు అంతలోనే అలలు అటుగా నవ్వు..

''ఎందుకంటే... ఎందుకంటే... ఎల్లుండి నుంచి ఆషాడం! శ్రావణం వచ్చే వరకూ మీరు మా యింటి రారుగా! అందుకని తీశాను. క్షమించండి'' అంది వనజ అతని వీపుమీద వేలితో సున్నాలు చుడుతూ.

''ఊహు, క్షమించను - శిక్షిస్తాను'' అన్నాడు శ్రీకాంత్.

ఆ శిక్షేమిటో ఆమెకి తెలుసు.